సాక్షి
పల్నాడు
గురువారం । 3 । అక్టోబర్ । 2024



ఆలయ అభివృద్ధికి విరాళం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరులో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన కొమ్మినేని నిష్‌నాథ్ రూ.లక్ష అందజేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 32,600 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 588.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో పితృకార్యాలు



అమరావతి: అమరా రామక్షేత్రంలో బుధవారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పలువురు తమ తమ పితృదేవతలకు భక్తి శ్రద్ధలతో పితృకార్యాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు కాలం చేసిన తమ తల్లిదండ్రులు, బంధువులకు పిండ ప్రదానం చేసి ఆ పిండాలను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించి బాల చాముండికా సమేత అమరేశ్వరుడిని దర్శించుకున్నారు.

పులిచింతల వద్ద మొసలి



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు పై బుధవారం ఉదయం మొసలి సంచరించడాన్ని స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని కొందరు ప్రాజెక్టు నిర్వాహకులకు తెలియచేయడంతో వారు వచ్చి మొసలిని ప్రాజెక్టు స్టాక్ పాయింట్‌లోకి పంపించారు. ప్రాజెక్టు మీదుగా వెళ్లే పాదచారులు, నదిలో స్నానాలకు వెళ్లేవారు జాగ్రత్త వహించాలని తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్ సూచించారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకలను పురస్కరించుకుని భ్రమరాంబ అమ్మవారు బాలా త్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపురసుందరి, కదంబ వనవాసిని, మహాలక్ష్మి, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దిని, రాజరాజేశ్వరి అలంకరణల్లో భక్తులను దర్శనం ఇవ్వనున్నారు. విజయ దశమి రోజున ఉదయం మహా పూర్ణాహుతి, సాయంకాలం శమీపూజ నిర్వహించనున్నారు. గురువారం అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులను అనుగ్రహించనున్నారు.

విజయకీలాద్రిపై ప్రత్యేక పూజలు



తాడేపల్లిరూరల్ : సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ భాద్రపద అమావాస్యను పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

అమ్మవారికి రూ.2 లక్షల పట్టుచీరలు




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో అమ్మవారి అలంకరణకు అవసరమైన పట్టుచీరలను భక్తులు దేవస్థానానికి అందజేస్తున్నారు. విజయవాడకు చెందిన సినీ దర్శకుడు పి.కాశీ పరశురామ్ తల్లిదండ్రులైన శ్రీనివాసరావు, నాగజ్యోతి, మరో భక్తుడు రావాడ చిరంజీవిరావు బుధవారం రూ.2 లక్షల విలువైన పట్టుచీరలను దేవస్థానానికి అందజేశారు. దసరా ఉత్సవాలలో అమ్మవారికి జరిగే విశేష అలంకరణను పురస్కరించుకుని ఆయా రంగుల చీరలను అందజేసినట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు.

ఇంద్రకీలాద్రికి ఉత్సవ శోభ

ఇంద్రకీలాద్రిపై నెలకొన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 12వ తేదీ శనివారంతో ముగుస్తాయి. ఈ పది రోజుల్లో 15 లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా. ఉత్సవాలు ముగిసిన రెండు, మూడు రోజుల వరకు కూడా భవానీల రద్దీ కొనసాగుతుంది.

- అమ్మవారి దర్శనానికి 15 లక్షల మంది వస్తారని అంచనా
- భక్తులకు సౌకర్యవంతంగా సకల ఏర్పాట్లు

నేటి నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రులు ప్రారంభం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దుర్గమ్మను విశేష అలంకారాలలో దర్శించుకోనున్నారు. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అలంకరణ జరుగుతుండటంతో పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేస్తుంటారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని దేవదాయ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చెబుతున్నారు. భవానీల రద్దీ తగ్గే వరకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ఏర్పాట్లు కొనసాగుతాయన్నారు.

సులభంగా... సౌకర్యవంతంగా!

అమ్మవారి దర్శనానికి ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు చిన్న పాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా దర్శనం చాలా సులభంగా, సౌకర్యవంతంగా చేసుకోవచ్చు. రైలు, బస్సుల్లో నగరానికి చేరుకునే భక్తులు దేవస్థానం బస్సులతో పాటు ప్రయివేటు వాహనాలలో వీఎంసీ కార్యాలయం వరకు చేరుకుంటారు. అక్కడే దేవస్థానం ఏర్పాటు చేసిన క్లోక్‌రూమ్‌లో లగేజీ భద్రపరుచుకుని కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలైన్‌లోకి చేరుకోవచ్చు. ఒక వేళ భక్తులు అధిక సంఖ్యలో ప్రయివేటు వాహనాలలో నగరానికి చేరుకున్నట్లయితే వారి వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక పాయింట్లు ఏర్పాటు చేశారు. వాహనాలను పార్కింగ్ చేసుకున్న అనంతరం కెనాల్ రోడ్డుకు చేరుకుని క్యూలైన్‌లోకి ప్రవేశించవచ్చు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వారి కోసం భవానీపురం పరిసరాలలో వాహనాలను నిలుపుకొని హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్ల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు. స్నానఘాట్లకు సమీపంలోనే పార్కింగ్ ప్రదేశాలు ఉండేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంది.

టికెట్ల విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు

రూ.500 టికెట్‌పై అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం దేవస్థానం అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసింది. వినాయకుడి గుడి నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్లలో టోల్‌గేట్, ఓం టర్నింగ్, ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి ప్రాంగణం వద్ద టికెట్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా సీతమ్మ వారి పాదాలు, పున్నమి ఘాట్, స్టేట్ గెస్ట్ హౌస్‌లలో వీఐపీ టికెట్ల కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఆయా ప్రాంతాలలో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులను దేవస్థానం తమ వాహనాలపై ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వరకు చేరుస్తుంది. అక్కడి నుంచి క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకోవచ్చు.



విలేకరులతో మాట్లాడుతున్న ఈవో రామరావు



బందోబస్తుకు హాజరైన పోలీసులు



ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి : ఈవో

దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు తెలిపారు. బుధవారం మహా మండపం ఆరో అంతస్తులో మీడియా సమావేశంలో ఈఓ మాట్లాడుతూ 5 క్యూలైన్ల ద్వారా భక్తులు నిరంతరం అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. సాయంత్రం అమ్మవారికి మహానివేదన, పంచహారతుల సమయంలో అంతరాలయంలో హారతులు జరుగుతుంటాయని, ఆ సమయంలోనూ దర్శనాలు కొనసాగుతాయన్నారు. రూ.500 టికెట్ కొనుగోలు చేసిన భక్తులకు బంగారు వాకిలి దర్శనం మాత్రమే ఉంటుందన్నారు. దర్శనం అనంతరం మహా మండపం దిగువకు చేరుకునే భక్తులకు లడ్డూ ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

దుర్గమ్మకు పట్టుచీర సమర్పించిన సీపీ



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు విచ్చేస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు

ఇంద్రకీలాద్రి: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నగర పోలీస్ శాఖ తరఫున సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు బుధవారం దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూజా సామగ్రిని సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన సీపీ రాజశేఖర్‌బాబు దంపతులను ఆలయ ఈవో కె.ఎస్.రామరావు, ఆలయఅర్చకులు, వేద పండితులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, అర్చకులు, ఈవోకు సీపీ రాజశేఖరబాబు పట్టు చీర, పూజా సామగ్రిని అందజేశా రు. ఈవో రామరావు సీపీతో పాటు ఇతర పోలీసు అధికారులకు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం
- శ్రీబాల త్రిపుర సుందరీదేవిగా అలంకరణ, నిత్య పూజలు
- ఉదయం 9 గంటలకు అమ్మవారి దర్శనం
- ఉదయం 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 6 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవ సేవ
- సాయంత్రం 6–30 గంటలకు అమ్మవారికి మహానివేదన, పంచహారతులు
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

- ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

ఇసుక దొరకదాయె!

- జిల్లాలో అందుబాటులో లేని ఇసుక
- బుక్ చేసుకునేందుకు సచివాలయాలకు వెళ్లిన వారికి నిరాశే
- బ్లాక్‌లో అధిక ధరలకు కొనుగోలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన డంపుల్లో ఇసుక మాయం
- తెలుగు తమ్ముళ్ల మాయాజాలం
- నిలిచిపోయిన భవన నిర్మాణాలు
- పస్తులుంటున్న భవన నిర్మాణ రంగ కార్మికులు

మేం అధికారంలోకి రాగానే ప్రజలకు ఉచితంగా ఇసుక అందజేస్తామని కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి 100 రోజులైనా ఇసుక అందుబాటులోకి రాలేదు. ఉచితం మాట ఎలా ఉన్నా ధర చెల్లించి కొందామన్నా అందుబాటులో లేని పరిస్థితి. బయట మార్కెట్‌లో ఇసుక ధర చూసి భయపడి భవన నిర్మాణదారులు పనులు నిలిపివేశారు. దీంతో పనులు లేక కార్మికులు పస్తులుంటున్నారు. టీడీపీ నాయకులు మాత్రం ఇసుక బ్లాక్‌లో అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు.

SAKSHI సాక్షి గ్రౌండ్ రిపోర్టు GROUND REPORT

ఉచితానికి మంగళం



సత్తెనపల్లి లక్ష్మీటాకీస్ సమీపంలో ఇసుక లేక నిలిచిపోయిన ఓ భవన నిర్మాణం

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని అమరావతి మండలం వైకుంఠపురం, అచ్చంపేట మండలంలోని కోనూరు, చింతపల్లి, మాదిపాడు, రాజుపాలెం మండలం కొండమోడు, వినుకొండ మండలం తిమ్మాయపాలెంలలో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ ఏడు స్టాక్ పాయింట్ల వద్ద 2.39 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేసింది. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి నేతలు వాటిలో అధిక భాగం బ్లాక్‌లోకి తరలించి సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. దీంతో ఇసుక సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది.

దోచుకుంటున్న తమ్ముళ్లు...

స్టాక్ యార్డు నుంచి ఇసుక రవాణా జరకపోవడంతో ఇదే అదనుగా జిల్లా వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు దోపిడీకి తెరతీశారు. ఇప్పటికే స్టాక్ పాయింట్ల నుంచి రాత్రి పూట అక్రమంగా ఇసుక తరలించి నిల్వచేశారు. ఆ ఇసుకను గుంటూరు, నరసరావుపేట వంటి నగరాలు, పట్టణాలలోని బడా బిల్డర్లకు ఇసుకను సరఫరా చేస్తున్నారు. మరో వైపు ఇసుకను బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. నాలున్నర టన్నుల ఇసుక ట్రాక్టర్ అమరావతిలో ప్రస్తుతం రూ.6–7 వేలకు అమ్ముతున్నారు. దీంతో సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండటం లేదు. పక్కనే కృష్ణానది ఉన్నా ఇసుక బుకింగ్ కోసం సచివాలయాలకు వెళితే జిల్లాలో ఎక్కడ అందుబాటులో లేదని, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇదెక్కడి విడ్డూరమని వినియోగదారులు వాపోతున్నారు. ఈనెల 5వ తేదీ వరకు బుకింగ్‌లు పూర్తి అయ్యాయని అధికారులు చెబుతున్నారు. అర్ధరాత్రి వేళ స్లాట్ బుకింగ్ మొదలైనా కేవలం బడా బిల్డర్లకే టోకెన్లు దొరుకుతున్నాయి. దీంతో 20 టన్నుల ట్రక్కును వినియోగదారులు రూ.20–30 వేలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ఆందోళనబాటలో కార్మికులు

మూడు నెలలుగా ఇసుక సరఫరా చేసే లారీ యజమానులు, కార్మికులకు పనిలేక తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో కార్మికులు పడుతున్న కష్టాలను తీర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాకు సీఐటీయూ పిలుపునిచ్చింది.

జగనన్న ప్రభుత్వంలో టన్ను రూ.650



పెద్దపెద్ద కాంట్రాక్టర్లు ముందుగానే ఇసుకను డంప్ చేసుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. సామాన్యులకు మాత్రం ఇసుక దొరకడం లేదు. దాని ప్రభావం భవన నిర్మాణ కార్మికులపై పడుతోంది. ఉచిత ఇసుక ఇస్తామని చెప్పిన ప్రభుత్వం టన్ను రూ.1,650 దాకా బ్లాక్‌లో అమ్ముతున్నారు. జగనన్న ప్రభుత్వంలో టన్ను రూ.650కే అందుబాటులో ఉండేది.

-డి బాపనయ్య, తాపీ మేస్త్రి, పిడుగురాళ్ల

32 వృత్తుల వారికి ఉపాధి లేదు



ఇసుక లభించక దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది. భవన నిర్మాణం నిలిచిపోవడంతో, తాపీ మేస్త్రీలు, కూలీలు, భవన నిర్మాణరంగంపై ఆధారపడిన రాడ్ బెండింగ్ వర్కర్లు, ప్లంబర్లు ఇలా 32 వృత్తుల వారికి పనులు లభించడం లేదు. ఎలా బతకాలో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి.

-కాసా సాంబయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చిలకలూరిపేట

మూడు నెలలుగా ఇసుక లేదు



మూడు నెలలుగా ఇసుక దొరక్కపోవడంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నాకే పని దొరక్కడం లేదు. నా కింద పనిచేస్తున్న 25 మందికి నేను ఎలా ఉపాధి చూపగలను. సెంట్రింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రిషియన్ వంటి వృత్తుల వారికి ఉపాధి లేక తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. పనికి వెళితేనే సరుకులు కొనుగోలు చేసేవారు. పస్తులు పడుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే ఇసుక అందుబాటులోకి తేవాలి.

–చిమటా రామారావు, మేస్త్రి, సత్తెనపల్లి

కార్మికులకు న్యాయం చేయలేదు..



అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేస్తామన్న కూటమి ప్రభుత్వం 100 రోజులైనా పట్టించుకోలేదు. సత్తెనపల్లిలో బ్లాక్‌లో ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలకు అమ్ముతున్నారు. సచివాలయంలో బుకింగ్ చేయడానికి ప్రయత్నిస్తే కర్నూలు, చిత్తూరు, నెల్లూరులో ఇసుక అందుబాటులో ఉందని చెబుతున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్ ఇసుక రావడానికి సుమారు రూ.25 వేలు అవుతుంది.

– అవ్వారు ప్రసాదరావు, సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు

ఇసుకను అందుబాటులో ఉంచాలి...



కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక అందిస్తామని మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఉచితం కాదు కదా డబ్బులకు కూడా దొరకని పరిస్థితి. ఇసుక ప్రజలకు చేరడం లేదు. దళారులు లారీల ద్వారా వారి దొడ్లకు తరలించి అధిక ధరకు అమ్ముతున్నారు. ఇసుక కొరత లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

–వలి, తాపీమేస్త్రి, గురజాల

తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాం...



కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే జిల్లాలో ఇసుకే అందుబాటులో లేకుండా చేసింది. దీంతో నిర్మాణాలు నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

–చింతపల్లి నాగమల్లేశ్వరరావు, మాదల

సత్యం, అహింస ప్రపంచ మానవాళికి మార్గం

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- గాంధీజీకి నివాళులర్పించిన జేసీ, అధికారులు
- కలెక్టరేట్‌లో స్వచ్ఛతా హి సేవా



గాంధీజీ కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట: జాతిపిత మహాత్మాగాంధీ అనుసరించిన సత్యం, అహింస సిద్ధాంతాలు నేటి ప్రపంచ మానవాళికి అనుసరణీయమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్, కలెక్టరేట్ ఆవరణలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద గాంధీ చిత్రపటాలకు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకంలతో కలిసి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ అనుసరించిన సత్యం, అహింస సిద్ధాంతాల మూలంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయంలో రికార్డు రూములను పరిశీలించారు. జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారి కరుభ మధులత పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జేసీ, డీఆర్వో, ఇతర జిల్లా అధికారులు పాల్గొని కలెక్టరేట్ ప్రాంగణ పరిసరాల్లోని చెత్తను సేకరించి అందరిలో స్ఫూర్తిని నింపారు. ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు, గాజు పెంకులను తొలగించి ప్రత్యేక సంచులలో వేశారు. రాబోయే వారంలో కూడా చెత్త తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి పౌరుడు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కృషిచేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

యూటీఎఫ్ సత్యాగ్రహ దీక్ష



నరసరావుపేట ఈస్ట్: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయ సారథి కోరారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 10 సంవత్సరాలు గడుస్తున్నా మున్సిపల్ ఉపాధ్యాయులకు ఇతర ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, ఉత్తర్వులు లభించకపోవడం శోచనీయమని తెలిపారు. ఇప్పటికైనా పాఠశాల విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించాలని ఆయన కోరారు. దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇతర పార్టీల నాయకులు సందర్శించి సంఘీభావాన్ని తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి


అమరావతి: కూటమి ప్రభుత్వం కొలువు తీరిన నాటి నుంచి మండల పరిధిలోని మల్లాది ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. గ్రామస్తులు అందించిన సమాచారం ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం 25మంది అధికార పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇండ్లపై దాడులు చేయగా ముగ్గురు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. జెర్రిపోతు సాంబయ్య, జెర్రిపోతు రాజుకు తీవ్ర గాయాల కావటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. సొంగా వెంకటేశ్వర్లు అమరావతి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు, స్వల్ప గాయాలైన మంటి నాగేశ్వరరావు, నరసింహారావు, శ్రీనివాసరావులు ఇంటి దగ్గరే ఉన్నారు. ఈ సంఘటనపై ఇంత వరకు కేసు నమోదు కాలేదు

బార్ యజమానిపై దాడి

స్టేషన్ ఆవరణలో రెండో వర్గం ప్రతీకార దాడి

నరసరావుపేట టౌన్: బిల్లు చెల్లించే విషయంలో తలెత్తిన వివాదం బార్ యజమానిపై దాడికి దారితీసింది. ఇరువర్గాలు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వద్దకు చేరుకోగా, ఒక వర్గం ప్రతీకార దాడులకు తెగబడింది. పోలీసులు లాఠీచార్జి చేసి రెండు వర్గాలను చెల్లాచెదురు చేశారు. మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న సంఘటనకు సంబందించి టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాష్‌నగర్‌కు చెందిన కళ్యాణ్, ఇస్లాంపేటకు చెందిన జానీలు మద్యం తాగేందుకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బార్ అండ్ రెస్టారెంట్‌కు మంగళవారం రాత్రి వెళ్లారు. బిల్లు చెల్లించే విషయంలో సిబ్బందితో వాగ్వివాదం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న బార్ యజమాని బెల్లంకొండ శ్రీనివాసరావు కలుగచేసుకొని దురుసుగా మాట్లాడాడు. దీంతో అతనితో పాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. సంఘటనలో రెండు వర్గాలకు చెందిన నలుగురికి గాయాలు కావడంతో ఫిర్యాదు చేసేందుకు టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న బార్ యజమాని బెల్లంకొండ శ్రీనివాసరావు కుమారులు, జనసేన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే కిశోర్, అనిల్‌లు అనుచరులతో అక్కడకు చేరుకొన్నారు. స్టేషన్ ఆవరణలో ఉన్న జానీపై దాడి చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు లాఠీచార్జి చేసి రెండు వర్గాలను చెదరగొట్టారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. బార్ యజమాని ఫిర్యాదుతో కళ్యాణ్, జానీ మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం సీఐ హైమారావు తెలిపారు.

మద్యం పాలసీపై మహిళా సంఘాల నిరసన



లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ప్రతిఘటన తప్పదని మహిళా సంఘాల నాయకులు హెచ్చరించారు. విధానాన్ని మార్చడం అంటే షాపుల సంఖ్య పెంచడమే కాకుండా, బార్‌లు అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచడానికి అవకాశం ఇవ్వడమేనని ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ అన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై శంకర్ విలాస్ సెంటర్‌లో బుధవారం ఐద్వా, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మద్యాన్ని ఎక్కువ రేటుకి అందించిందని, కూటమి ప్రభుత్వం ఇప్పుడు తక్కువ ధరకు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మద్యం మత్తులో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు చూస్తూ కూడా ప్రభుత్వం మహిళలకు భరోసా ఇవ్వలేకపోతోందని పేర్కొన్నారు. మద్యం విధానాన్ని మార్చుకోకపోతే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర ,కార్యదర్శి ఎ.కళ్యాణి, కె.పద్మ, కృష్ణకుమారి, షకీలా, సీఐటీయూ నాయకులు కాశీం షహీద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్. నగర కార్యదర్శి సమీర్ యశ్వంత్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

జన జాతీయ గ్రామ అభియాన్‌తో ఎస్టీల అభ్యున్నతి



కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ, అధికారులు

నరసరావుపేట: ప్రధానమంత్రి జన జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ పథకాన్ని జిల్లాలో షెడ్యూలు తెగలు నివాసం ఉండే ఏడు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో పథకం పోస్టర్లను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వి నాయకంలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్యూలు తెగల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 649 జిల్లాలలోని 2740 బ్లాకుల్లో ఎస్టీలు నివాసం ఉండే 63,843 గ్రామాల్లో అమలు చేస్తారని చెప్పారు. పథకం ద్వారా ఐదు కోట్ల ఎస్టీలు లాభపడనున్నారని పేర్కొన్నారు. వారందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం చేస్తారని చెప్పారు. పథకానికి రూ.79,156కోట్లు కేటాయించగా కేంద్రం రూ.56,333కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.23,863కోట్లు ఖర్చు చేస్తాయని కలెక్టర్ వివరించారు.

జిల్లాలో ఏడు గ్రామాలు ఎంపిక

జిల్లాలోని ఐదు మండలాల్లో గల ఏడు గ్రామాల్ని ఎంపిక చేశారని కలెక్టర్ తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలోని చింతల తండా పంచాయతీలోని నాగులవరం, బొల్లాపల్లి మండలంలోని అయ్యన్న పాలెం, కనుమల చెరువు, దోమలగుండం పంచాయతీలోని గండిగనుముల, దాచేపల్లి మండలంలోని భట్రుపాలెం, అచ్చంపేట మండలంలోని మాదిపాడు పంచాయతీలోని మాదిపాడుసేరి, దుర్గి మండలంలోని రాజానగర్ పంచాయతీలో గల నిదానంపాడులలో ఈ పథకం అమలవుతుందని వెల్లడించారు. ఇందులో 17 మంత్రిత్వ శాఖలు పాల్గొని 25 కార్యాచరణలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. డెవలప్మెంట్ యాక్షన్ ప్లాన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్ ద్వారా నిధులు కేటాయించి నివాసాలు, తాగునీటి వసతి, విద్యుత్, రోడ్లు, ఆరోగ్య సౌకర్యాలు, నాణ్యమైన విద్య, వృత్తి నైపుణ్యం కోసం ఖర్చు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ పీడీ వరలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి కేవీ భాస్కరరెడ్డి, డ్రిగ్ ఇరిగేషన్ జిల్లా అధికారి ఆంజనేయులు, ఆర్డీవో మధులత పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

ఖైదీల సంక్షేమ దినోత్సవంలో న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

నరసరావుపేటటౌన్: ఖైదీలు మానసిక పరివర్తన పొంది సత్ప్రవర్తనలతో మెలగాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. ఆశీర్వాదం పాల్ సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని సబ్ జైల్లో బుధవారం ఏర్పాటు చేసిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. వివిధ కారణాలవల్ల జైలుకు రిమాండ్ ఖైదీలుగా వచ్చిన వారు ప్రవర్తన మార్చుకొని, విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో ఉన్నత స్థానాలను అధిరోహించాలని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలు, రోజువారి జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను వివరించారు. సబ్ జైలు సూపరింటెండెంట్ రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ సబ్ జైల్లో రిమాండ్ ఖైదీలకు లభించే సౌకర్యాలు, వివిధ సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం రిమాండ్ ఖైదీలకు వివిధ అంశాల్లో ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి న్యాయధికారి, సూపరింటెండెంట్లు నివాళి అర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- కిరాతకంగా హత్య చేసిన భర్త
- వివాహేతర సంబంధం అనుమానంతో ఘటన
- పరారయ్యే ప్రయత్నంలో భర్తకు తీవ్ర గాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐలు



ఘటనా స్థలంలో త్రివేణి మృతదేహం



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మురళీకృష్ణ

నరసరావుపేట రూరల్: భార్యను భర్త కిరాతకంగా హత్యచేసిన ఘటన మండలంలోని పమిడిపాడు సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు. బెల్లకొండ మండలం వన్నాయపాలెం గ్రామానికి చెందిన బోనం మురళీకృష్ణ, మాచాయపాలేనికి చెందిన త్రివేణి(31)కి 14 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా త్రివేణి గ్రామానికి మరొక వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే అనుమానంతో ఇద్దరి మధ్యా పలుమార్లు వాగ్వ్వాదం చోటుచేసుకుంది. పద్ధతి మార్చుకోమని మురళీకృష్ణ భార్యను హెచ్చరించాడు. ఇంకా అనుమానం పెంచుకున్న మురళీకృష్ణ ఆమెను అంతమొందించాలని పథకం పన్నాడు.

ఆసుపత్రికని తీసుకువచ్చి...

కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్న మురళీకృష్ణ, త్రివేణిలు మూడు రోజుల క్రితం వన్నాయపాలేనికి వచ్చారు. గ్యాస్ట్రబుల్ సమస్య ఉండటంతో దొడ్లేరులోని ఆర్ఎంపీ వద్ద మురళీకృష్ణ చికిత్స పొందాడు. దీనిపై పరీక్షల నిమిత్తం బుధవారం నరసరావుపేటలోని ప్రభుత్వాసుపత్రికి బయలుదేరాడు. తనతో పాటు రావాలని కోరడంతో భార్య త్రివేణి వెంట నరసరావుపేటకు వచ్చింది. ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. పమిడిపాడు గ్రామ శివారులోని డొంక రోడ్డు నుంచి పంట పొలాల్లోకి త్రివేణిని మురళీకృష్ణ తీసుకువెళ్లాడు. పథకం ప్రకారం ముందుగా వెంట తెచ్చుకున్న కత్తితో భార్యపై గొంతుపై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు.

పరారయ్యే ప్రయత్నంలో ప్రమాదం

పంట పొలాల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ కె.నాగేశ్వరరావు, రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కిషోర్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇదే సమయంలో భార్యను హత్య చేసిన మురళీకృష్ణ హైదరాబాద్‌కు పరారయ్యే ప్రయత్నంలో కారంపూడి సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో ప్రమాదానికి గురైయ్యాడు. అతడు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించే క్రమంలో తనకు బతకాలని లేదని, భార్యను తానే హత్య చేశానని, పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లాలని సిబ్బందిని కోరారు. విషయాన్ని 108 సిబ్బంది కారంపూడి పోలీసులకు తెలియజేశారు. మురళీకృష్ణ నుంచి వారు వివరాలు సేకరించి నరసరావుపేట రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మురళీకృష్ణను నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. త్రివేణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

మహాత్ముడి బోధనలు నేటికీ అనుసరణీయం

ఎస్పీ కంచి శ్రీనివాసరావు



మహాత్ముని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింస ఆయుధాలుగా స్వాతంత్ర్య సమరాన్ని ముందుండి నడిపారని తెలిపారు. అహింసా మార్గంలో ఉద్యమించి, బానిస సంకెళ్లు తెంచి, బ్రిటిష్ పాలకుల నుంచి దేశానికి విముక్తి కలిగించిన ఆయన బోధనలు నేటికీ అనుసరణీయమని పేర్కొన్నారు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వేరెవరో పరిరక్షించరని, మనకు మనమే వాటిని కాపాడుకోవాలని ఆయన చెప్పిన మాటలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. జాతిపిత చూపిన బాటను అనుసరిస్తూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లడమే మన ముందున్న కర్తవ్యమని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ ఆర్. రామచంద్ర రాజు, డీఎస్పీ నాగేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత



నాగేశ్వరరావు మృతదేహాన్ని వైద్యశాలకు తరలిస్తున్న కమిటీ సభ్యులు

రొంపిచర్ల : మండలంలో వీరవట్నం గ్రామానికి చెందిన కేతరాజుపల్లి నాగేశ్వరరావు(85) అనారోగ్యంతో మృతి చెందారు. కాగా మృతుడి కుమారుడు వేమలయ్య తండ్రి మృతదేహాన్ని రొంపిచర్ల భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సభ్యులు సహకారంతో, అమ్మ నేత్ర అవయవ శరీర దానం ప్రోత్సాహక సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీకి అప్పగించారు. నేత్రాలను పెదకాకాని శంకర కంటి ఆస్పత్రికి అందించారు. ఈ సందర్భంగా అమ్మ నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సహక సంఘం పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు మాట్లాడుతూ వ్యక్తి మృతి చెందిన అనంతరం నేత్రాలు కొన్ని గంటల వరకు అలానే ఉంటాయని, వాటిని మట్టిపాలు చేయకుండా దానం చేయడం వల్ల ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చని తెలిపారు. శరీర అవయవాలను వైద్య కళాశాలలో విద్యార్థుల ఉపయోగార్థం వినియోగించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సభ్యులు సరికొండ రామకృష్ణంరాజు, శేషంరాజు, కనుమూరి శివరామ్, వెంకట సుబ్బరాజు, మస్తాన్ వలి, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పురుగు మందుల వ్యాపారిపై రైతుల ఫిర్యాదు

రూ.2 కోట్ల బకాయిలు ఇప్పించాలని వినతి

నాదెండ్ల: గొరిజవోలు గ్రామానికి చెందిన పురుగు మందుల వ్యాపారి తమకు చెల్లించాల్సిన సుమారు రూ.2 కోట్లను ఇప్పించాలని కొందరు రైతులు నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. గొరిజవోలుకు చెందిన రెడ్డిమల్లి బాజిరెడ్డి పదేళ్ల కిందట వరకు అక్కడే పురుగు మందుల షాపు నిర్వహించాడు. ఆ తర్వాత నరసరావుపేటలో వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతులకు అప్పుగా గానీ, పంట ఉత్పత్తులకు నగదు రూపేణా గానీ రూ.2 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆరు నెలల నుంచి బాజిరెడ్డి రైతులకు అందుబాటులో లేడు. అయితే, ఇటీవల నరసరావుపేట ఎస్పీ కార్యాలయంలో వ్యాపారానికి సంబంధించి తనకు రూ.4–5 కోట్లు రావాల్సి ఉన్నాయని, తాను చెల్లించాల్సిన బకాయిలు కూడా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. తనకు రావాల్సిన బకాయిలు వసూలైతే, రైతులకు తిరిగి చెల్లిస్తానని పేర్కొన్నాడు. అయితే, బాజిరెడ్డి నుంచి తమకు రావాల్సిన మొత్తాలను తిరిగి ఇప్పించాలంటూ రైతులు నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు ఇసుక సమస్యపై సీపీఎం ధర్నా



లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టాలని ఈ నెల 4వ తేదీన అన్ని మండల, పట్టణ కేంద్రాలలో ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. బుకింగ్‌కు ఆన్‌లైన్ విధానం తెచ్చినా ఆచరణలో పేదలకు ఇసుక అందడం లేదన్నారు. ఈ స్థితిలో 4వ తేదీన పార్టీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా నాయకులు వై.నేతాజీ, ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, ఎస్.ఎస్. చెంగయ్య, డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, బి.కొటేశ్వరమ్మ, ఎం.ఎ.చిష్టీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల ఖోఖో జట్ల ఎంపిక



కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఖోఖో అండర్– 14 ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపికలు బుధవారం పూర్తయ్యాయని సెలక్షన్ కమిటీ బుధవారం తెలిపింది. బాలుర జట్టుకు ఎం. కేశవ (కారెంపూడి), ఎం. రవికిరణ్(ఒప్పిచర్ల), డి. అఖిల్ (కారెంపూడి), బి. ఆంజనేయులు నాయక్ (వినుకొండ), ఎం. కమలేష్ (నర్సరావుపేట), షేక్ నాబి రసూల్ (నకరికల్లు), డి. కిరణ్‌కుమార్ (క్రోసూరు), వి. మనోహర్ (ఒప్పిచర్ల), బి. జాన్ జీవన్ (కారెంపూడి), బి. రాజు (వింజనంపాడు), సీహెచ్. లక్ష్మణ్ (తాడికొండ), ఎం. శ్రీకాంత్ (ఈపూరు)తో పాటు స్టాండ్‌బైలుగా మరో నలుగురు ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు టి. ఉమా హర్షిత (చెరుకుపల్లి), బి. లక్ష్మీప్రసన్న (ఒప్పిచర్ల), ఎం. సంజన మాధురి (మంగళగిరి), కె. వైష్ణవి (బి.పురం), జె. నాగమణి (వినుకొండ), వి. దేవి (కారెంపూడి), వై. హర్షిత (కారెంపూడి), కె. పద్మ (రెంటచింతల), బి. శ్రీలక్ష్మి (రొంపిచర్ల), బి. ఐశ్వర్య (చిలకలూరిపేట), బి. చౌడేశ్వరి (రెంటచింతల), పి. దీక్షిత (నర్సరావుపేట)తో పాటు మరో నలుగురు స్టాండ్‌బైలుగా ఎంపికయ్యారు.

సెపక్‌తక్రా విజేతలు కర్నూలు, అనంతపురం

- ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రకాశం, కృష్ణా
- ముగిసిన రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలు



ప్రథమ బహుమతి అందుకుంటున్న కర్నూలు జిల్లా బాలుర జట్టు



అనంతపురం జిల్లా బాలికలకు జట్టుకు ప్రథమ బహుమతి అందిస్తున్న గుంటూరు డీవీఈఓ జె.పద్మ

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల విజేతలుగా కర్నూలు, అనంతపురం నిలిచాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి ప్రగతి జూనియర్ కళాశాల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ 68వ స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా రాష్ట్రస్థాయి పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెదమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రెండు రోజులుగా జరిగాయి. బుధవారం పోటీలు ముగిశాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ స్థానం కర్నూలు జిల్లా, ద్వితీయ స్థానం ప్రకాశం జిల్లా, తృతీయ స్థానం పశ్చిమగోదావరి జిల్లా కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానం అనంతపురం జిల్లా, ద్వితీయ స్థానం కృష్ణా జిల్లా, తృతీయ స్థానం పశ్చిమగోదావరి జిల్లా జట్లు విజయ కేతనం ఎగురవేశాయి. విజేతలకు ఇంటర్మీడియట్ విద్యా ఆర్ఐఓ జి.కె.జుబేర్, గుంటూరు డీవీఈఓ జె.పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకట్రావు, సత్తెనపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, జనసేన నేత బొర్రా వెంకట అప్పారావు, గ్రామ సర్పంచ్ యం. అన్నపూర్ణమ్మ, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు, టోర్నమెంట్ రాష్ట్ర పరిశీలకులు సి.మారుతీ ప్రసాద్, అండర్ -19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్.పద్మాకర్, ఇంటర్ క్రీడల కార్యదర్శి యస్.సుధాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శివరామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు బి.అనీల్‌దత్తానాయక్, లాకు పిచ్చయ్య, కె.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టు ఎంపిక

జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే బాలబాలికల సెపక్ తక్రా జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టుకు సెలక్షన్ టీమ్ సభ్యులుగా ఎస్.రమేష్, రమ, మాధవి, బాలికల జట్టుకు సీహెచ్. పద్మాకర్, ఎస్.సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు.

కార్యక్రమంలో సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు, టోర్నమెంట్ రాష్ట్ర పరిశీలకులు సి.మారుతీ ప్రసాద్, అండర్ -19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్. పద్మాకర్, ఇంటర్ క్రీడల కార్యదర్శి యస్.సుధాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శివరామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు బి.అనీల్‌దత్తా నాయక్, లాకు పిచ్చయ్య, కె. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి Smart Economic Display Advertisement Feature



సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED

■ GVK సంస్థలో గుంటూరు, పల్నాడు జిల్లాలలో మెడికల్స్ డెలివరీ చేయుటకు M/F స్టాఫ్ కావలెను. మంచిజీతం సంప్ర: 7730997214, 9110364326

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్నవారికి ఆఫీసుల, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్, Ltd కంపెనీలలో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీస్ వర్క్ ✆ 9063255441

■ ప్రముఖ ఆఫీసు నందు పనిచేయుటకు ఇంటి పనివారు, ఆటో, కారు డ్రైవర్లు, టెలికాలర్స్, మేనేజర్లు, కావలెను. మంచి జీతం, గుంటూరు. 6305122366

■ ప్రముఖ స్కూల్ నందు కంప్యూటర్ నాలెడ్జి కలిగిన కంప్యూటర్ ఆపరేటర్ మరియు డిగ్రీ చదివిన టీచర్స్ కావలెను. మంచి జీతం ✆ 9550028851

■ M.S Office, Excelలో అనుభవం ఇంగ్లీష్ టైపింగ్ వచ్చిన కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీ:10–15వేలు, ఆటోనగర్, తెనాలి. 9490157852, 7815829957

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 7702473949

■ మేదరమెట్ల TI ప్రాజెక్ట్‌లో ఈ క్రింది పోస్టులలో పనిచేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. 1.M&EA (B.Com ఉత్తీర్ణత), 2.ప్రోగ్రాం మేనేజర్ (MSW) పై రెండు పోస్టులకు కంప్యూటర్ అనుభవం తప్పని సరి. వెంటనే తమ దరఖాస్తులు 10-10-24లోగా help.sacs@gmail.com ఈ మెయిల్‌కు పంపగలరు. సంప్ర: ✆ 99497 23666 ఒంగోలు.

■ విజయవాడలో పేషెంట్‌లని, పెద్దవారిని వారి ఇంటి వద్దే ఉండి చూసుకొనుటకు నర్సులు (ANM, GNM) హాస్పిటల్స్‌లో పనిచేసిన ఆయాలు, హోంకేర్‌లో అనుభవమున్న కేర్ టేకర్స్ కావలెను. జీతం 16K-26K కాల్ / వాట్సప్ ✆ 91608 35559, 98850 25559

■ Wanted Experienced Female Tele Caller work from home for Loans Sal + Incentives. Contact Cell: 90301 00111.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692.

■ శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ ఫుడ్ వసతి. జీ: 18K. ఫోన్: 9912011899

■ గుంటూరు సిటిలో ప్రైవేట్ విద్యాసంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. అనుభవం గల ఫీల్డ్ ఆఫీసర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. రూమ్+భోజనం ఫ్రీ. ESI + PF ✆ 99595 95903

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం

గుంటూరు 7075167541 7075167663

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.